క్లుప్తంగా

ఎంవీపల్లె పంచాయతీకి రూ. 2.60 లక్షల ఆదాయం

కేవీపల్లె : మండలంలోని ఎంవీపల్లె గ్రామ పంచాయతీకి వారపు సంత వేలంపాట ద్వారా రూ. 2.60 లక్షలు ఆదాయం లభించింది. బుధవారం ఎంవీపల్లె వారపు సంతకు సంబంధించి గేటు వసూలు హక్కుకు వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా వారపు సంతను హెచ్చుపాట ద్వారా గ్రామానికి చెందిన కాటంరెడ్డి 2.60 లక్షలకు దక్కించుకున్నట్లు ఇన్చార్జి ఈవోపీఆర్డీ లతీఫ్‌ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.90 వేలు ఆదాయం

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లె గ్రామ పంచాయతీకి వారపుసంత వేలం పాట ద్వారా రూ.90 వేలు ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో వారపుసంత వేలం పాట నిర్వహించారు. కాశీం సాహెబ్ రూ.90 వేలకు దిక్కించుకున్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

బి.కొత్తకోట : బైక్ ఢీకొన్న ఘటనలో వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం మండలంలోని కనికలతోపులో జరిగింది. కనికలతోపుకు చెందిన ఎస్.వెంకటరమణ (72) రోడ్డుపక్కన నిలబడి ఉండగా మొలకలచెరువు మండలం బురకాయలకోటకు చెందిన బాబా ఫక్రుద్దీన్ బైక్‌పై వెళ్తూ ఢీకొన్నాడు. గాయపడిన బాధితుడిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తికి గాయాలు

మదనపల్లె : రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ చిన్నపరెడ్డిగారిపల్లెకు చెందిన ఈశ్వరరెడ్డి (50) బైక్‌పై వ్యక్తిగత పనుల కోసం మదనపల్లెకు వస్తుండగా అంగళ్లు సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద మరో ద్విచక్రవాహనం వేగంగా ఢీకొంది. ప్రమాదంలో ఈశ్వరరెడ్డి తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ

బి.కొత్తకోట : ఇంటిపన్నులు ప్రస్తుత డిమాండ్, పెండింగ్ బకాయిలున్న చెల్లింపుదారులకు ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పిస్తూ నిర్ణయం తీసుకుందని బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి బుధవారం తెలిపారు. ఇంతవరకు చెల్లించాల్సిన మొత్తం పన్ను ఎంతుందో, దానిపై విధించిన వడ్డీలో 50శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. బకాయిదారులు చెల్లించాల్సిన పన్నులలో రాయితీ ఉండదని స్పష్టం చేశారు. వడ్డీ చెల్లింపుకు కల్పించిన రాయితీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని పన్నులు సత్వరమే చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి దోహదపడాలని కమిషనర్ కోరారు.

డాక్టరేట్ ప్రదానం



సులోచనకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ సభ్యులు

మదనపల్లె : పట్టణానికి చెందిన నేషనల్ హ్యూమన్‌రైట్స్ కమిషన్ ఏపీ మహిళా ప్రధాన కార్యదర్శి కోనేటి సులోచనకు ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పాండిచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ సంస్థ జాతీయస్థాయిలో వివిధ రంగాల్లో విశేషసేవలు అందించిన పలువురిని గుర్తించి డాక్టరేట్లు ప్రదానం చేసింది. అందులోభాగంగా అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన కోనేటి సులోచనకు సామాజిక సేవా కార్యక్రమాల్లో సేవలు అందిస్తున్నందుకు డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కోనేటి సులోచన మాట్లాడుతూ డాక్టరేట్ తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించేందుకు స్ఫూర్తినిచ్చిందని తెలిపారు.

ఇఫ్తార్ విందులతో సోదరభావం పెంపు

కురబలకోట : ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్ చౌదరి అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అంగళ్లు జామియా మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. పండగ వాతావరణంలో స్నేహభావం, ఐక్యత, సామరస్యం, సామాజిక సమగ్రతకు ప్రాధాన్యమిస్తూ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రియాజ్, శ్రీనివాసులు, మహేష్, షరియాజ్, జబ్బార్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు, హిందువులు

గురుకులం..శిలాఫలకంలో భద్రం

- స్థలమున్నా నిర్మాణానికి నిధులేవి?
- వెనక్కువెళ్లిన రూ. 8.32 కోట్ల నిధులు
- రేకుల షెడ్డులో ఉడికిపోతున్న విద్యార్థినులు
- తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య



పాఠశాలకు కేటాయించిన స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు



రేకుల షెడ్డులో భోజనం చేస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థినులు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో ఏపీ గురుకుల బాలికల పాఠశాల పేరు నూతన భవన నిర్మాణం శిలాఫలకంలో ఏళ్ల తరబడి భద్రంగా ఉంది. భవన నిర్మాణాలకు అనువైన స్థలం కేటాయించినా నిధుల లేక ముందుకు సాగడంలేదు. నిర్మాణానికి అవసరమైన రూ. 8.32 కోట్ల నిధులు మంజూరై వెనక్కి వెళ్లిపోయాయి. వేసవిలో ఎండల వేడిమికి రేకుల షెడ్డులో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

2009లో గురుకులానికి శంకుస్థాపన

మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో గుర్రంకొండకు ఏపీ గురుకుల బాలికల పాఠశాల మంజూరు చేశారు. పాఠశాల మంజూరు చేయడంతో పాటు నూతన భవన నిర్మాణాలకు అవసరమైన నిధులను అప్పట్లో మంజూరు చేశారు. 2009 మేనెల 25న గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అయితే ఇంతవరకు నిర్మాణాలు చేపట్టలేదు. ఇక్కడ పాఠశాల ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు నిర్మాణాలు ప్రారంభం కాలేదు.

స్థలమున్నా నిర్మాణాలకు నిధుల మంజూరేది?

ఏళ్ల తరబడి స్థలం కోసం గాలించిన అధికారులు ఎట్టకేలకు చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామంలో నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించారు. గుర్రంకొండ– సరిమడుగు ప్రధాన రహదారికి పక్కనే సర్వేనెంబర్లు 61/4,61/5లలో 4.85 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారుల గురుకుల బాలికల పాఠశాల భవన నిర్మాణాల కోసం కేటాయించారు. ఇందుకు సంబంధించి సదరు స్థలం తాలుకూ స్వాధీన పత్రాలను పాఠశాల ప్రిన్సిపాల్‌కు రెవెన్యూ అధికారులు అప్పగించారు. ఇటీవల కొంతమంది గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేయడానికి యత్నించారు. దీంతో అధికారులు అప్రత్తమైన సదరు స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. స్థలం కేటాయించి ఏళ్లు గడుస్తున్నా భవన నిర్మాణాలకు మాత్రం ఇంతవరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం గమనార్హం. నిధులు మంజూరు చేస్తే వందలాది మంది విద్యార్థినులకు ఎంతో మేలు జరుగుతుందని గ్రామస్తులు అంటున్నారు.

వెనక్కు వెళ్లిన నిధులు

2009లో గురుకుల పాఠశాల భవనాల నిర్మాణాల కోసం రూ. 8.32 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. అయితే అప్పట్లో రెవెన్యూ అధికారులు తగినంత స్థలం కేటాయించక పోవడంతో నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఏళ్ల తరబడి రెవెన్యూ అధికారులు ఎపీ గురుకుల బాలికల పాఠశాలకు స్థలం కేటాయించకపోవడంతో నిర్మాణాలకు మంజూరైన నిధులు వెనక్కుపోయాయి. దీంతో పాఠశాల నిర్మాణపనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోయింది.

రేకుల షెడ్లలోనే పాఠశాల నిర్వహణ

పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి రేకులషెడ్లు లాంటి అద్దెభవనాల్లోనే పాఠశాలను నిర్వహిస్తున్నారు. ప్రారంభంలో చిట్టిబోయనపల్లె సమీపంలో రేకుల షెడ్డులో పాఠశాల ప్రారంభించారు. శిథిలమైపోయిన రేకులషెడ్డులో రెండు సంవత్సరాలు గడిపారు. తదనంతరం గుర్రంకొండలో ఇందిరమ్మ కాలనీ వద్ద మరో అద్దెరేకుల షెడ్డులోకి పాఠశాల మార్చారు. అప్పటి నుంచి ఈ షెడ్లలోనే పాఠశాల నిర్వహిస్తున్నారు. అద్దెభవనాలకు ప్రతినెలా ప్రభుత్వం రూ.55 వేలు అద్దె చెల్లిస్తుండడం గమనార్హం.

తగ్గిన విద్యార్థినుల సంఖ్య

గురుకుల పాఠశాల ప్రారంభంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి 428 మంది విద్యార్థినులు పాఠశాలలో చేరారు. అయితే ఇక్కడ సౌకర్యాలు లేక పోవడంతో పాటు అద్దెభవనాలు, మరోవైపు రేకులషెడ్లతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తల్లిదండ్రులు ఇక్కడి సౌకర్యాలను పరిశీలించి వెనక్కు వెళ్లిన సంఘటన చోటు చేసుకున్నాయి. పరిస్థితులు ప్రభావం, సౌకర్యాలు లేకపోవడంతో ప్రస్తుతం 208 మంది విద్యార్థులు మాత్రమే ప్రస్తుతం ఇక్కడ చదువుకుంటున్నారు. ఇటీవల పాఠశాలను తనిఖీ చేయడానికి వచ్చిన గురుకుల పాఠశాల కమిషనర్ ఇక్కడి సౌకర్యాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు.

భవనాలు నిర్మించాలి



గుర్రంకొండలోని గురుకుల బాలికల పాఠశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి. ఎన్నో ఏళ్ల నుంచి అద్దెభవనాలు, రేకుల షెడ్లల్లో పాఠశాల నిర్వహిస్తున్నారు. కనీసం పడుకోవడానికి, చదువుకోవడానికి సరైన స్థలం లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు సహకరిస్తే విద్యార్థినులకు మేలు జరుగుతుంది.

– లక్ష్మీదేవి, విద్యార్థిని తల్లి, సంద్రవారిపల్లె

మంచి భవనాల కోసం గాలిస్తున్నాం

ప్రస్తుతం రేకుల షెడ్లు లాంటి అద్దెభవనంలో పాఠశాల నిర్వహిస్తున్నాం. అన్ని వసతులున్న అద్దె భవనం కోసం గాలిస్తున్నాం. సరైన భవనం దొరికితే వెంటనే పాఠశాలను అందులోకి మార్చేస్తాం. చిట్టిబోయనపల్లె వద్ద 4.86 ఎకరాల స్థలం ఇచ్చారు. అయితే నిర్మాణానికి మాత్రం నిధులు ఇవ్వలేదు.

– సాయి శిరిష, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల, గుర్రంకొండ

హామీలు విస్మరించిన 'కూటమి'



వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

పెద్దతిప్పసముద్రం : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలో మద్దయ్యగారిపల్లిలో నిర్వహిస్తున్న గంగజాతరకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు హరిప్రసాద్ ఆహ్వానం మేరకు వచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలను ఆత్మీయంగా పలకరించి మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మారుమూల గ్రామీణ రోడ్లు సైతం తారు రోడ్లుగా అభివృద్ధి చేశామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టిన అధికారంలోని వచ్చిన కూటమి ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ కొట్టి మల్లికార్జున, జెడ్పీటీసీ ఉంగరాల శివన్న, నాయకులు పట్టిరిక శంకర్, సుబ్బిరెడ్డి, బీవీ. సుబ్బరాం, సయ్యద్ బాషా, కేశవ్, రహ్మతుల్లా, ఖాదర్‌వలి, ఉత్తన్న, పూల గిరీష్, రాజన్న, కుమార్‌రెడ్డి, ఆనందరెడ్డి, మేకల చంద్ర, రాజశేఖర్, మధు, రమణారెడ్డి, రాజన్న, పిండి వెంకటరెడ్డి, ఇమ్రాన్, శీనా, సోము, మెకానిక్ చంద్రశేఖర్, సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

కరుణించమ్మా.. గంగమ్మా

పెద్దతిప్పసముద్రం : గంగమ్మ తల్లీ.. మమ్ములను కరుణించవమ్మా.. అంటూ మండలంలోని పీటీఎం, అంకిరెడ్డిపల్లి, మడుమూరు, మద్దయ్యగారిపల్లి తదితర గ్రామాల ప్రజలు గంగమ్మను వేడుకున్నారు. పీటీఎంలో రెండు రోజులుగా జరుగుతున్న నడివీధి గంగ జాతర వేడుకలు బుధవారంతో ముగిశాయి. గంగ జాతరలో భాగంగా భక్తులు గంగమ్మకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి జంతు బలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక సంత బజార్‌లో ప్రతిష్ఠించిన గంగ, గౌరీ ప్రతిమల ఎదుట భక్తులతో పాటు నాయకులు, అధికారులు పూజలు నిర్వహించారు. మండల వాసులే గాక కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి జాతరను తిలకించారు. జాతర్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



పూజలందుకున్న గంగ, గౌరీ ప్రతిమలు

అన్నదానం

స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రజలకు అన్నదానం చేశారు. గంగ జాతర సందర్భంగా దూర ప్రాంతాల వచ్చే బాటసారులు, వ్యాపారస్థులు, యాచకులు, భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి (వాల్మీకిపురం) : కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలాంటి వారని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీరిపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి నాయకులతో పార్టీ బలోపేతంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతంలో భాగంగా ఇప్పటికే నియోజకవర్గ, మండల స్థాయిలో నియామకాలు ప్రకటించడం జరిగిందని, ప్రస్తుతం గ్రామ, మండల స్థాయిలో పార్టీతో పాటు 21 అనుబంధ విభాగాలల్లో కమిటీల నియామకాలు చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఆయా విభాగాలలో పార్టీపై ఆసక్తి, ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యకర్తలకు కమిటీలలో చోటు కల్పిస్తే క్షేత్ర స్థాయిలో బలపడవచ్చన్నారు.

కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల కాలంలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్, సెవన్ హామీలలో ఏ ఒక్కటీ అమలు చేయలేక చతికిలపడిందని ఎద్దేవాచేశారు. ఇలాంటి తరుణంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు.

సన్మానం

నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించి నూతనంగా నియమితులైన మండల పార్టీ కన్వీనర్లను మాజీ ఎమ్మెల్యే సన్మానించారు. అలాగే నియోజకవర్గ స్థాయి పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను దుశ్శాలువాలతో సత్కరించి పార్టీ పటిష్టానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, కలికిరి, వాల్మీకిపురం, కలకడ, కేవీపల్లి మండల కన్వీనర్‌లు చింతల రమేష్‌రెడ్డి, పులి శివకుమార్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, వెంకట్రమణారెడ్డి, నేతలు నీళ్ల భాస్కర్, బిడ్డల కేశవరెడ్డి, పసల భాస్కర్‌రెడ్డి, దావూద్, లక్ష్మీరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జయరామచంద్రయ్య, మల్లికార్జున, రాజన్న, అనిత, సతీష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మదనపల్లె సిటీ : యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యూఎస్‌ఏకు చెందిన ట్రెడిషనల్ మెడిటేషన్ ప్రాజెక్టు అంతర్జాతీయ ఉపాధ్యాయులు సుసన్, లిండా, సార అన్నారు. బుధవారం స్థానిక సొసైటీకాలనీలోని విజయభారతి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు ఇన్‌చార్జి కవిత, కరస్పాండెంట్ ఎన్.సేతు, వైస్ ప్రిన్సిపాల్ నిషిత, హెచ్ఎం రాణి, శివకుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

సద్వినియోగం చేసుకోండి

పీలేరు రూరల్ : స్థానిక కోటపల్లె రోడ్డులోని షీ దివ్య యోగ విద్యాలయంలో యోగా సమ్మర్ క్యాంప్ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ విజయకుమారి సూచించారు. బుధవారం స్థానిక ఆర్‌టీఓ కార్యాలయంలో యోగ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. షీ దివ్య యోగ నిర్వాహకులు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మి, రాయల సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు ప్రథమచికిత్సకే పరిమితం కావాలి

డిప్యూటీ డీఈఎంఓ దేవశిరోమణి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఎంఓ దేవశిరోమణి

మదనపల్లె : మదనపల్లెలో ఆర్‌ఎంపీలు ప్రథమచికిత్సకు మాత్రమే పరిమితమై ఉండాలని, నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డిప్యూటీ డీఈఎంఓ దేవశిరోమణి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని శ్రీరస్తు కల్యాణమండపంలో ఆర్‌ఎంపీ వైద్యులతో అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు రోగులకు, క్షతగాత్రులకు నిబంధనల ప్రకారం ప్రథమచికిత్స అందించేందుకు మాత్రమే అనుమతి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే ఆర్‌ఎంపీ వైద్యులు వైద్యసేవలు అందించాలని, కేంద్రంపై ప్రథమచికిత్స కేంద్రం అని రాయాలని సూచించారు. ఆర్‌ఎంపీ క్లినిక్‌లకు వచ్చే వారిని సమీపంలోని ప్రభుత్వ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులకు పంపించాలన్నారు. ముఖ్యంగా మహిళా ఆర్‌ఎంపీలు గర్భిణులకు ఎలాంటి వైద్యసేవలు అందించకూడదని తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేయడం, మందులు, ఇంజక్షన్ల ద్వారా చికిత్స అందించి, వ్యాధి తీవ్రమైన తర్వాత ప్రభుత్వాసుపత్రులకు పంపించడం వల్ల అప్పటికే వారు నీరసించి కోలుకోలేని పరిస్థితులకు వెళుతున్నారన్నారు. దీంతో ఆర్థికంగా, శారీరకంగా అన్ని విధాలుగా నష్టపోతున్నారని వివరించారు. కార్యక్రమంలో సర్జన్ డాక్టర్.బి.రమేష్‌బాబు, పీఎంపీఏ అధ్యక్షులు సీఎస్.మూర్తి, యమలాసుదర్శనం, ప్రభాకర్‌నాయుడు, హర్షవర్ధనమ్మ, ఆదినారాయణ, మధు, ప్రతాప్, రామాంజులు, ఆదినారాయణ, శంకర్, నాగరాజు, చంద్రశేఖర పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : మహిళల అభ్యున్నతితో పాటు సాధికారిత సాధించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాల సభ్యురాళ్లు, మెప్మా ఆర్పీలకు ఉచిత కుట్టుమిషన్ల పథకంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉచిత కుట్టుమిషన్ల పథకానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. నియోజకవర్గంలో మహిళల కోసం ఉపాధి కల్పించేందుకు టైలరింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, పరమేశ్వరరెడ్డి, మెప్మా సీఎంఎం మధుసూధన్‌రెడ్డి, ఏపీఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అధికారులు మాటవినకపోతే అక్కడే కూర్చోండి

టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఏ ఆఫీసుకు వెళ్లినా, అధికారులు మాట వినకపోయినా, మర్యాద ఇవ్వకపోయినా, అక్కడే కూర్చొని, తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం సాయంత్రం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పోలీస్ యంత్రాంగం సహకరించడం లేదని ఆరోపించారు. టౌన్‌బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, నీలకంఠ, ఆర్.జే.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

టీడీపీ నాయకుడి దాడిలో గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పరామర్శించారు. దాడికి కారణాలను బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆలయానికి విరాళం

కురబలకోట : భార్య జ్ఞాపకార్థం ఓ భర్త ఆలయానికి విరాళం అందజేసి శ్రీమతిపై ఉన్న మక్కువను అంతకు మించి గౌరవాన్ని చాటుకున్నారు. మండలంలోని తెట్టు గ్రామం పూజారివారిపల్లెకు చెందిన రమణ, వెంకటలక్ష్మి దంపతులు. నెల క్రితం అనారోగ్యంతో వెంకటలక్ష్మి మృతి చెందింది. కష్టనష్టాల్లో తోడునీడగా ఉంటూ వచ్చిన భార్య ఆకస్మిక మృతితో భర్తతో పాటు కుటుంబాన్ని కుంగదీసింది. ఈమె జ్ఞాపకార్థంగా సమీపంలోని పాలేటి గంగమ్మ గుడికి రూ.50,116 విరాళంగా కుటుంబీకులతో కలిసి ఆలయ ధర్మకర్త పూజారి అంజికి బుధవారం రమణ అందజేశారు. ఈ విరాళాన్ని గుడి వద్ద వంట గదికి వినియోగించాలని కోరారు. భక్తులు, బంధుమిత్రులు భోజనాలు వండుకునేందుకు సౌకర్యంగా వంటగదిని నిర్మిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పూజారి అంజి తెలిపారు. పూజారి పవన్, కుమార్తె పూజారి అశ్విని పాల్గొన్నారు.



ఆలయానికి విరాళం అందజేస్తున్న పూజారి రమణ

రేపు మినీ జాబ్‌మేళా

పీలేరు రూరల్ : స్థానిక ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే జాబ్ మేళాలో అశోక్ లేలాండ్, పేటీఎం కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఏదైనా పీజీ, డిప్లొమా విద్యార్హత కల్గిన 18– 30 వయస్సు కల్గిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9966086996, 9177143181 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పది పరీక్షలకు 10 మంది గైర్హాజరు

కలకడ : మండలంలో బుధవారం జరిగిన పదో తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్షకు 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కలకడ ఉన్నతపాఠశాల పరీక్షల బాధ్యుడు మోడెం చెంగల్‌రాయుడు తెలిపారు. కోన, కలకడ తెలుగు, కలకడ ఆదర్శ పాఠశాల కేంద్రాల్లో సమీపంలో 144 సెక్షన్ విధించి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పటిష్ట బందోబస్తు

పీలేరురూరల్ : పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ

రామసముద్రం : మండలంలోని పశువైద్య కేంద్రంలో బుధవారం పాడిరైతులకు 40శాతం సబ్సిడీతో మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారిణి డాక్టర్ దివ్య మాట్లాడుతూ మొక్కజొన్న సాధారణ ధర కిలో రూ.68, జొన్న సాధారణ ధర రూ.15.80పైసలు ఉండగా, 40శాతం సబ్సిడీ ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతులు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్యాధికారిణి డాక్టర్ దివ్య, పశువైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

వైద్యసేవలు విస్తరణ

మదనపల్లె : పట్టణంలోని నక్కలదిన్నె సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వాస్థ ఆస్పత్రిలో పేదరోగులకు అందుబాటులో మరిన్ని వైద్యసేవలను విస్తరించినట్లు వ్యవస్థాపకుడు, పద్మభూషణ్ శ్రీఎం(ముంతాజ్‌అలీ) తెలిపారు. బుధవారం పట్టణంలోని నక్కలదిన్నె స్వాస్థ ఆస్పత్రిలో సీటీ స్కానర్, అల్ట్రాసౌండ్, చిల్డ్రన్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల ఆరోగ్యసంరక్షణను మరింత మెరుగుపరిచేందుకు స్వాస్థ ఆస్పత్రి తన వైద్యసేవలను విస్తరించిందని తెలిపారు. కార్యక్రమంలో స్వాస్థ ఆస్పత్రి డైరెక్టర్ వెంకటరమణ, డాక్టర్.శోభ వెంకట్, సత్సంగ్ ఫౌండేషన్ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన సంతానదేవత శ్రీ రెడ్డెమ్మ కొండ ఆలయానికి హుండీ ద్వారా రూ. 4,05,053 ఆదాయం వచ్చింది. బుధవారం స్థానిక ఆలయంలో రెండు నెలల కాలానికి సంబంధించి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. భక్తులు వివిధ రూపంలో అమ్మవారికి సమర్పించిన కానుకల ద్వారా రూ. 4,05,053 నగదు, నాలుగు గ్రాముల బంగారు, 100 గ్రాముల వెండి వచ్చింది. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు ఆలయ ఈఓ మంజుల తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె దేవాదాయశాఖ అధికారి శశికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనలు అజరామరం

మదనపల్లె సిటీ : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య కీర్తనలు అజరామరమని వీహెచ్‌పీ నాయకుడు సురేష్ అన్నారు. బుధవారం స్థానిక అన్నమయ్య సర్కిల్‌లో అన్నమయ్య 552 వర్ధంతి కార్యక్రమం జరిగింది. అన్నమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అఖండ నవభారత్ నిర్మాణ్ అధినేత వరదారెడ్డి నారదరెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య తాళ్లపాకలో జన్మించి వేంకటేశ్వరుడిపై కీర్తనలు ఆలపించడం గర్వించ దగ్గ విషయమన్నారు. తాళ్లపాక అన్నమయ్య పేరులోనే ఓ పవిత్రతత ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లేనాయక్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పారదర్శకంగా వేలం నిర్వహించాలి

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ వేలంపాట పారదర్శకంగా నిర్వహించాలని ఎస్ఎస్‌యూఐ నాయకులు అమృతతేజ కోరారు. బుధవారం పంచాయతీ ఈవో గురుమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నిర్వహించనున్న షాపింగ్ గదులు, వారపు సంత, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, జంతు వధశాలల వేలం సీసీ కెమెరాల నిఘాలో జరపాలని కోరారు. షాపింగ్ గదులకు కాల పరిమితి ఏడాదికి కాకుండా మూడు సంవత్సరాలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు మహేష్, మంజునాథ్, భాను, లిఖిత్, ఆదిత్య, స్వామి, సాయి పాల్గొన్నారు.

బీసీల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి

మదనపల్లె సిటీ : బీసీల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర పాల ఏకరి సేవా సమితి అధ్యక్షుడు జన్నే రాజేంద్రనాయుడు కోరారు. బుధవారం స్థానిక పాల ఏకరి సేవా సంఘ కార్యాలయంలో బీసీల ఆత్మీయ సమావేశం పోస్టర్లను ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక రామారావు కాలనీలోని శ్రీరస్తు కల్యాణమండపంలో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. బీసీల ఐక్యత కోసం సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, నరసింహులు, గంగులప్ప, చంద్రశేఖర్‌నాయుడు, చలపతి, కొండయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.